క్లుప్తంగా

రేకుల షెడ్డు తొలగింపు



రేకుల షెడ్డును తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామ చెరువులో రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు వేసిన రేకులషెడ్డును తహసీల్దార్ బాషసింగ్, ఆర్ఐ రజనీస్ సిబ్బందితో కలిసి గురువారం తొలగించారు. ఇటీవల చెరువులో షెడ్డు నిర్మించారని, దేవుడి విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేశారని తెలిపారు. అనుమతి లేకపోవడంతో దీన్ని తొలగించామని, ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

డీఎల్‌పీవో విచారణ



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ వీరబుచ్చయ్య

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో వీరబుచ్చయ్య గురువారం విచారణ చేపట్టారు. సర్పంచ్ విధులు సరిగా నిర్వహించట్లేదని, సర్పంచ్ భర్త సమావేశాల్లో కల్పించుకుని పలు అభివృద్ధి పనులకు ఆటంకం కల్గిస్తున్నాడని ఉపసర్పంచ్ బండారి శ్రీనివాస్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ సెక్రెటరి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. నూతన గ్రామపంచాయతీ నిర్మాణంపై తీర్మానం ఇవ్వకపోవడంపై చర్చించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో వార్డుసభ్యులు సంపత్, పద్మ, మహంకాళి హారిక, కోఆప్షన్‌మెంబర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ

సైదాపూర్: మండలంలోని సర్వాయిపేట, పెర్కపల్లి గ్రామాల్లో మండల పశువైద్యాధికారులు గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. రెండు గ్రామాల్లోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశామని వైద్యాధికారి విజేందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు కొమురయ్య, ఐలయ్య, ఎంపీటీసీ మల్లేశం, సిబ్బంది లాలూనాయక్, మహేశ్, సమ్మిరెడ్డి, గోపాల మిత్ర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శంకరపట్నం: జీవాలకు నట్టల నివారణ మందులు వేశామని పశు వైద్యాధికారి మాధవరావు తెలిపారు. మండలంలోని తాడికల్, కన్నాపూర్‌లో గురువారం గొర్రెలు, మేకలకు మందు వేశామని పేర్కొన్నారు. జీవాలను కాపాడుకునేందుకు యజమానులు నట్టల నివారణ మందు తాగించాలని సూచించారు.

డీజేలు వాడితే చర్యలు

రామడుగు: మండల పరిధిలోని గ్రామాల్లో డీజే సౌండ్స్ పూర్తిగా నిషేధించామని నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై అంజయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీజే సౌండ్స్ యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వివాహ వేడుకలు, ఇతర శుభ కార్యక్రమాలకు డీజే సౌండ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న సత్యరాజ్‌వర్మ

రామడుగు: వైఎస్ షర్మిలరెడ్డిపై అక్రమంగా నమోదు చేసిన కేసులను తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ తహసీల్దార్ రాజుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవిశాస్త్రి, చంద్రయ్య, చీమకుర్తి లక్ష్మణ్, సురేష్, మోహన్, రాజేశం, సురేష్, లక్ష్మిరాజం పలువురు పాల్గొన్నారు.

పెట్టుబడికి రైతుల అప్పులు

- యాసంగిలో పూర్తిగా అందని 'రైతుబంధు'
- వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- పథకం అమలుపై దృష్టిసారించని అధికారులు
- తొమ్మిదిన్నర ఎకరాలలోపు వారికే అందిన వైనం
- పావలా వడ్డీకే బ్యాంకులు రుణాలు ఇస్తే అప్పుల నుంచి రైతులు బయటపడినట్టే



రైతుబంధు చెక్కులు పొందిన లబ్ధిదారులు (ఫైల్)

మండలంలోని గ్రామాలు	మొత్తం రైతులు
17	11,892
జమకావాల్సిన ఆర్థికసాయం	
రూ.13.7 కోట్లు	
ఇప్పటివరకు సాయం పొందిన రైతులు 11,493	

చిగురుమామిడి: మండలంలోని రైతులకు యాసంగి రైతుబంధు పూర్తిస్థాయిలో అందలేదు. పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. 1,493 మందికి సాయం అందగా మిగతా రైతులకు రైతుబంధు నిధులు జమకావాల్సి ఉంది. కొత్తగా పాసుపుస్తకాలు పొందిన దాదాపు 1,050 మంది సాయం పొందాల్సి ఉన్నా ఇంకా ఎన్‌రోల్ చేయలేదు.

రైతుల ఎదురుచూపు

గతేడాది డిసెంబర్ 25వ తేదీ నుంచి దశలవారీగా 9.30 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో నగదు జమైనట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఆపై భూములు కల్గిన రైతులకు సాయం అందకపోవడంతో పెట్టుబడికి అప్పులు చేస్తున్నారు. అసలు నిధులు విడుదలవుతాయా లేదా అనే మీమాంసలో ఉన్నారు.

నాలుగు విడతలు ఆలస్యం

ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు గత నాలుగు విడతలు ఆలస్యంగా అందిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఆలస్యం చేస్తుండటంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

రెతులకు మిగిలేది కొద్దోగొప్పో

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం సరిపోవడంలేదనే విమర్శలు రైతుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఎకరా వరినాటుకు రూ.25వేల వరకు ఖర్చు అవుతుందని. ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే ఐదువేలు సరిపోక రైతులు వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పంట పండిన తర్వాత ఖర్చులు పోను రైతులకు మిగిలేది కొద్దోగొప్పో మాత్రమే. ఇలాగైతే రైతులు లక్షాధికారి అయ్యేదెప్పుడంటూ పలువురు మేధావులు చర్చించుకుంటున్నారు.

వర్షాకాలంలో నష్టం

ఏటా వర్షాకాలంలో రైతులు నష్టపోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలతో ఆశించిన దిగుబడి రాక పెట్టిన పెట్టుబడి తీర్చలేక అప్పుల్లో కూరుకుపోతున్నారు. యాసంగిలో నాన్ ఆయకట్టు గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటడంతో వరి పంటలు ఎండుతున్నాయి. నవాబుపేట్, చిగురుమామిడి, లంబాడిపల్లి, గాగిరెడ్డిపల్లి, ఉల్లంపల్లి, బొమ్మనపల్లి, సుందరగిరి, ఇందుర్తి గ్రామాల్లో పొట్టదశలోనే పంటలు ఎక్కువగా ఎండుతుంటాయి. పెట్టుబడి సాయం సరిపోక అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తే పంట చేతికి రాక రైతులు నష్టపోతున్నారు.

బ్యాంకులు అప్పులు ఇస్తే రైతులకు మేలు

ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి సాయం ఏమూలకు సరిపోవడం లేదు. పంట రుణాలు ఇచ్చే బ్యాంకులు పెట్టుబడి కోసం ప్రతి సీజన్‌లో పావలా వడ్డీకే ఎకరానికి ఇరువై వేల చొప్పున అందిస్తే రైతులు అప్పుల ఊబి నుంచి క్రమంగా బయటపడే అవకాశం ఉంది. విషయంపై ప్రభుత్వం, వ్యవసాయశాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

సరిపోవడంలేదు



రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు సాయం పెట్టుబడికి సరిపోవడంలేదు. ఎకరాకు ఇచ్చే ఐదువేలు రైతుల ఖర్చులను తీర్చడం లేదు. ఈ ఒక్క పథకం ఇచ్చి మిగతా పథకాలను ప్రభుత్వం రద్దు చేసింది.

– పైడిపెల్లి శ్రీనివాస్, రైతు, కొండాపూర్

ఎకరాకు ముప్పైవేలు..



ఎకరాకు పెట్టుబడి దాదాపు రూ.30వేలు అవుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ఐదువేలు సరిపోక వడ్డీవ్యాపారుల ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం బ్యాంకుల నుంచి జీరో వడ్డీ కింద ప్రతి పంటకు రుణాలు అందిస్తే బాగుంటుంది.

– ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, రైతు, లంబాడిపల్లి

ఖాతాల్లో జమవుతాయి



మండలంలోని రైతుబంధు లబ్ధిదారుల బ్యాంకు వివరాలు ట్రెజరీకి పంపాం. నిధులు రాగానే బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. ఇప్పటివరకు 9.30 ఎకరాలు ఉన్నవారికి డబ్బులు జమయ్యాయి. మిగతావారికి రావాల్సి ఉంది.

– రంజిత్‌కుమార్, ఏఓ, చిగురుమామిడి

'సీపీఎం' నిరసన



హుజూరాబాద్: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రజనీకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాడాలన్నారు. నాయకులు రమేష్, ఎండీ అజ్జు, కుమారస్వామి,చంద్రయ్య, కుమార్, రాజు, రత్నాకర్, అభిలాష్, అజయ్, వంశీ, నితిన్, సందేశ్ ఉన్నారు.

శంకరపట్నం: ప్రజాసమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ప్రజలపై కేంద్రప్రభుత్వం మోయలేని ఆర్థికభారం మోపిందని ఆరోపించారు. కేంద్రం విధానంతో నిరుద్యోగ సమస్య పెరిగిందని, వ్యవసాయ ఉత్పత్తులపై గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముకుందరెడ్డి, రాజు, యుగేందర్,తిరుపతి, లక్ష్మణ్, వెంకటేశ్, ఇస్మాయిల్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీణవంక: తహసీల్దార్ రాజయ్యకు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు కోప్పుల శంకర్, పల్లి రవియాదవ్ మాట్లాడుతూ కేంద్రం ప్రజలపై మోపుతున్న ఆర్థిక భారాలను తగ్గించాలని అన్నారు. నాయకులు వెంకటేష్, రమేష్, సాగర్, రాజేందర్, నాగరాజు, శంకర్, శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: ఆహారం, మందులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్‌లో అన్నిరకాల పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకంలో రెండు వందల రోజులు పని కల్పించాలన్నారు. జమ్మికుంట జోన్ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యులు సంపత్‌రావు, రాములు, సతీష్, సదానందం, రాజకుమారి, మధునయ్య, పోచయ్య, సురేష్, ఓదేలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పడేస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

చొప్పదండి: పట్టణంలోని చికెన్, మటన్, చేపలు, ఇతర దుకాణాల యజమానులు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ హెచ్చరించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ... మున్సిపల్ వాహనాల్లో వ్యర్థాలు, చెత్తాచెదారం వేయాలని నిబంధనలు అతిక్రమిస్తే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని, ఫెనాల్టీలు విధిస్తామని తెలిపారు.

మినీ డెయిరీలు మంజూరు

జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సొసైటీ ద్వారా పట్టణంలో అర్హులైన ఎస్సీ యువతకు మినీ డెయిరీ యూనిట్లు మంజూరు చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. పైలెట్ ప్రాజెక్టు కింద పట్టణానికి 60 యూనిట్లు మంజూరయ్యాయని, 50 సంవత్సరాల వయస్సు మించనివారు కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం పొందనవారు, కనీసం 20 గుంటల భూమి కలిగి ఉండాలని, పట్టాపాసుబుక్ తప్పనిసరి అని తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు ఉన్న ఆదాయ ధృవీకరణ పత్రాలను జతచేసి దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

తడి, పొడి వరి సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ కొండల్‌రెడ్డి

జమ్మికుంట: మండలంలోని నాగంపేట గ్రామంలో సీసీఎక్స్ పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తడి,పొడి వరి సాగు విధానంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్లస్టర్ కోఆర్డినేటర్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. వరిలో తడి, పొడి సాగు ద్వారా కార్బన్, మీథేన్ వాయువుల విడుదల తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. చీడ,పీడల ఉధృతి తగ్గి, దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు ఈ విధానం అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చందుపల్లి స్వాతికృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ పంజాల అశోక్, కోఆర్డినేటర్ రామకృష్ణ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దు



చిగురుమామిడి: మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

రామడుగు: ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు కలిగినా మనోధైర్యం కోల్పోవద్దని చొప్పదండి సీఐ రవీందర్ అన్నారు. మండలంలోని వెదిర గ్రామ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మనోధైర్యం కల్పనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, ఆపదలో డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. ఎస్సై అంజయ్య, ప్రత్యేకాధికారి కవిత, టీచర్లు పాల్గొన్నారు.

సైదాపూర్: పోటీ ప్రపంచంలో పోరాడితేనే రాణిస్తారని సైకాలజిస్ట్ ఆట్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అనే అంశంపై హెచ్ఎం అనురాధ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షలు ఆత్మవిశ్వాసంతో రాయగలను అనే నమ్మకంతో ఉండాలని సూచించారు. ఆహారం, నిద్ర నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అనంతరం తను రాసిన 'ప్రపంచాన్ని జయించండి లా' అనే పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. టీచర్లు మాలతి, స్వర్ణలత, సమ్మయ్య, భాస్కర్, రవిందర్‌రెడ్డి, సుధాకర్, అంబిక, రాజ్‌కుమార్‌లు న్నారు.

చిగురుమామిడి: సైబర్ నేరాల పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దాస సుధాకర్ సూచించారు. చిగురుమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విజ్ఞానమే అన్నింటికి మూలాధారమని, మూఢనమ్మకాలను నమ్మొద్దన్నారు. ఆపదలో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఎస్సై సొంత ఖర్చులతో పరీక్షా సామగ్రి అందజేశారు. పీసీ మురళి, ఎస్‌వో డి. రజిత, సీఆర్‌పీ ఆంజనేయులు, సీఆర్‌టీలు విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, సులోచన, రేణుక, గంగాజల తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాలం

హుజూరాబాద్: పట్టణ శివారులోని బోర్నపల్లి మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల ఆశ్రమ పాఠశాలలో గురువారం ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్న ఉద్దేశంతో 311 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారని, భవిష్యత్ తరాల బాగు కోసం ముందుచూపుతో సీఎం కేసీఆర్ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఇంద్రజాల ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆర్టీవో గౌతమెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఉన్నారు.

కేంద్ర పథకాలను రాష్ట్రం అణగదొక్కుతోంది

చిగురుమామిడి: కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం అణగదొక్కుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండలంలోని రేకొండ గ్రామంలో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. దళితులపై సీఎం కేసీఆర్ చిన్నచూపు చూస్తున్నారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలను చిత్రహింసలు పెట్టిన నిజాం వారసుడి అంత్యక్రియలు అధికారికంగా చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు వెంకటస్వామి, సంపత్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, సునీల్, చిరంజీవి, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల కోసం సంక్షేమ పథకాలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జమ్మికుంట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని శంభునిపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ వాసాల నిరోషరామస్వామి, ప్యాక్స్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వావిలాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సనాజవేరియా, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెగ్రిగేషన్ షెడ్డు సందర్శన



అధికారులకు వివరిస్తున్న ఎంపీపీ వనిత

మానకొండూర్: తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డును మహారాష్ట్ర అధికారుల బృందం గురువారం సందర్శించింది. చెత్త వేరుచేయడం, తడి చెత్తతో కంపోస్ట్ తయారీ విధానం, అమ్మకం, స్టాల్, ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ, రికార్డ్స్, శానిటేషన్, పని ప్రాసెస్ స్టడీ చేశారు. నర్సరీ, వైకుంఠధామం, ప్లాంటేషన్‌ను పరిశీలించారు. బృందంలోని ప్రశాంత్‌రాత్, వివేక్‌గాడ్, మిలింద్ కెల్కాకర్, సందేశ్ మండ్లేకర్, సావినయ్ జాదవ్, ప్రవీణ్, క్షీరసాగర్‌కు ఎంపీపీ కేతిరెడ్డి వనిత, సర్పంచ్ దుండ్ర నీలమ్మ, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శి కె. మహేందర్ రావు, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్లు రమేశ్, వేణు, రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్, చైర్మన్ రమేశ్‌రెడ్డి

మానకొండూర్: తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 'రహదారి భద్రత, మహిళల భద్రత'అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ బి.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధిగా రహదారి నియమాలు పాటించాలని సూచించారు. లేదంటే ప్రమాదాలు తప్పవని పేర్కొన్నారు. ప్రాణభయం, ఈవ్ టీజింగ్ వల్ల భయం ఉంటే మహిళలు 'షీ టీమ్'నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ యువత విధిగా రహదారి, మహిళల భద్రత పై అవగాహన పెంపొందించుకోవాలని, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసైతే మా దృష్టికి తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యువత రహదారి నియమాలను పాటించాలని, రోడ్లపై వాహనాలను బాధ్యతగా నడిపితే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ప్రమాదాలను నివారించేందుకే కళాశాల ఆధ్వర్యంలో బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 'షీ టీం' మహిళల భద్రత, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో 100 మంది విద్యార్థులు నినాదాలు చేస్తూ ఫ్లకార్డ్స్‌తో కళాశాల ప్రాంగణం నుంచి గీతాభవన్ వరకు, అక్కడి నుంచి తిరిగి కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఏవో రామారావు, మీడియా ఇన్‌చార్జి రమేష్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి.రవీందర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న వినోద్‌కుమార్, తదితరులు

మానకొండూర్: మండలంలోని సదాశివపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి అనంతరెడ్డి తండ్రి బాపురెడ్డి ఇటీవల మృతిచెందారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రణాళికా సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ శేఖర్ పరామర్శించారు. ఈకార్యక్రమంలో రొడ్డ పృథ్వీరాజ్, వాల ప్రదీప్‌రావు, చుక్కారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుక బడిన తరగతుల సంక్షేమ విద్యాశాఖల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియం గురుకుల పాఠశాలల్లోని ఐదో తరగతి 2023–24 సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలిని జమ్మికుంట గురుకుల (బాలుర) పాఠశాల ప్రిన్సిపల్ కుమారస్వామి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దూడపాక శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను మార్చి 6వ తేదీలోపు సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 11గంటల నుంచి 1గంట వరకు అన్ని జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు.

నేడు శంభుస్వామి జాతర



ముస్తాబైన శివకేశవాలయం

చొప్పదండి: పట్టణంలోని శివకేశవ ఆలయంలో శుక్రవారం శంభుస్వామి జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ, వివేకానంద యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 1,015 సంవత్సరాల చరిత్ర గల శివకేశవ ఆలయంలో ఏటా పాల్గుణ మాసం శుక్ల పంచమిన స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయ పరిసరాలను భక్తుల రద్దీకి అనుగుణంగా సిద్ధం చేశారు. శివుడు, కేశవుడు ఎదురెదురుగా ఉన్న అరుదైన ఆలయంగా ప్రసిద్ధి చెందిందని, కల్యాణ చాళుక్యుల కాలంలో నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. మధ్యాహ్నం దిష్టికుంభం, హోమం, రథోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

మార్చి 4న హుండీ లెక్కింపు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపును దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో, భక్తుల సమక్షంలో మార్చి 4న ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వాహక అధికారి కందుల సుధాకర్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. హుండీల లెక్కింపునందు ఆసక్తిగల భక్తులు డ్రెస్ కోడ్‌తో హాజరుకావాలని కోరారు.

సాయిబాబా ఆలయానికి వైస్ చైర్‌పర్సన్ విరాళం



విరాళం ఇస్తున్న వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి దంపతులు

చొప్పదండి: పట్టణంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, సాంబయ్య దంపతులు గురువారం రూ. 51,116 ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి విరాళంగా అందించారు. మార్చిలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దండె లింగయ్య, దూస రాము, దూస లక్ష్మీనర్సయ్య, కొల్లూరి ఆనందం, కటుకం మహేశ్, సిరిపురం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వివిధ వివాహ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నివాళి, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా: 9951602933, 9951602958, 9951602824

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899